ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇవేం రోడ్లురా బాబూ..!

అనకాపల్లి - చోడవరం మధ్య ఆర్‌విఎస్ నగర్ (దర్జీనగర్) వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

- దెబ్బతిన్న ప్రధాన రహదారులు
- ఇటీవల వర్షాలకు గుంతల్లో చేరిన నీరు
- అత్యవసర పనులకు ప్రతిపాదనలు పంపినా స్పందించని ప్రభుత్వం
- నిత్యం ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం మారినా రహదారులకు మోక్షం కలగలేదు. ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. వర్షాలు పడితే చెరువులను తలపించేలా పెక్కు రహదారులు మారుతున్నాయి. నడిచి పొలం గట్లుపైనైనా వెళ్లిరావొచ్చుగానీ రహదారులపై వెళ్లిరాలేని దుస్థితి నెలకొంది. వాహనాలపై వెళ్లడానికి భయపడేలా రోడ్లపై పెద్దపెద్ద గుమ్ములేర్పడ్డాయి. వీటినిండా నీరు చేరడంతో పడిపోతామన్న భయం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారులు, బస్సులు నడుపుతున్నవారిలో నెలకొంది. ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు చోడవరం, రావికమతం, మాడుగుల, అనకాపల్లి, నాతవరం, కోటవురట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు అధ్వాన్నంగా వున్నప్పటికీ ప్రాథమిక మరమ్మతులు చేయించేందుకు రోడ్లు, భవనాల శాఖ నుంచి ప్రతిపాదనలను ప్రభుత్వం అడగలేదు.

కొన్నిచోట్ల రోడ్డు దుస్థితిచూసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల చేయలేదు. రహదారుల మరమ్మతుల విషయంలో గత ప్రభుత్వం దారిలోనే ఈ ప్రభుత్వమూ నడుస్తున్నట్లుంది. జిల్లాలో 1400 కిలోమీటర్లలో రహదారులు వ్యాపించివున్నాయి. వీటిలో కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు 150 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. ఈ రహదారుల ప్రాథమిక మరమ్మతులు, అత్యవసర పనులకు దాదాపు రూ.2.10 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయినా అక్కడి నుంచి ఉలుకూ, పలుకూ లేకపోవడంతో చేసేదిలేక రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగులు చేతులు కట్టుకొని కూర్చొన్నారు. నర్సీపట్నం-చోడవరం రోడ్డు 30 కిలోమీటర్ల మేర దెబ్బతింది. ఈ మరమ్మతు పనులు కాంట్రాక్టర్ చేయాల్సివుంది. ఈ విషయం కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పనులు ప్రారంభించలేదు.

మరమ్మతులకు ఎంత అవసరం ?

ప్రధాన రహదారుల్లో దెబ్బతిన్న 69 కిలోమీటర్లలో ఏర్పడ్డ గుమ్ములు కప్పడానికి రూ.80.69 లక్షలు, మిగతా 2లో..

టిడిపి నేతలతో కలిసి నామినేషన్ వేస్తున్న నూకరత్నం

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు..

నేటితో నామినేషన్ల పర్వానికి తెర

ఇప్పటి వరకూ 15 నామపత్రాలు దాఖలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆగస్టు 7న జరగనున్న జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలకు మంగళవారం తెరపడనుంది. ఇప్పటివరకు 15 నామినేషన్లు అందాయని జివిఎంసి అధికారులు సోమవారం సాయంత్రం వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసిన వారిలో వైసిపికి చెందిన 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, 51వ వార్డు కార్పొరేటర్ వెంకటరమణ, 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్ మహమ్మద్, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రువాణి ఉన్నారు. అదేవిధంగా టిడిపికి చెందిన 56వ వార్డు కార్పొరేటర్ సరగడం రాజశేఖర్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి, 7వ వార్డు కార్పొరేటర్ పల్లి మంగమ్మ, 94వ వార్డు కార్పొరేటర్ బల్లా శ్రీనివాసరావు, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం నామినేషన్ దాఖలు చేయగా 35వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా విల్లూరి భాస్కరరావు నామినేషన్ దాఖలు చేశారు. స్థాయీ సంఘ నామినేషన్ల ప్రక్రియ జులై 22న ప్రారంభమవగా సోమవారం ఒక్కరోజే 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ప్రక్రియ మంగళవారం సాయంత్రంతో ముగియనుంది.

కుసులవాడ మైనింగ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

▶ వార్త 8లో..

మరణిస్తూ... ముగ్గురికి జీవితం

▶ వార్త 4లో..

పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వొద్దని ధర్నా

▶ వార్త మెయిన్‌లో...

మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించే..

అంతర్గత కమిటీలు ఉండాల్సిందే

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ప్రతి చోటా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013'కు సంబంధించిన పోస్టర్, హేండ్ బుక్‌ను ఆవిష్కరించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ సీతారామమూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, జిల్లా మహిళా శిశు అభివృద్ధి అధికారి డాక్టర్ జి.జయదేవి, జివిఎంసి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, స్వచ్ఛంద, క్రీడా, సహకార, విద్య తదితర సంస్థలతో పాటు నర్సింగ్ హోమ్‌లు, పరిశ్రమలు, ఆసుపత్రులు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధి కేంద్రాలు, బ్యాంకులు.. ఇలా ప్రతిచోటా కమిటీలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

భూములకు రక్షణ కల్పించండి

సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో సర్వే నెంబర్ 66లోగల 29.71 ఎకరాల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం (అంబికా బాగ్) భూములకు రక్షణ కల్పించి, ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలోగల ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న పూల్‌బాగ్ రోడ్డులో రాణిగారి పూలతోట సర్వే నెంబర్ 66 (టిడి నెంబర్ 3274)లో సుమారు రూ.1100 కోట్లు విలువైన 29.71 ఎకరాల భూమిని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం (అంబికా బాగ్)కు చెముడు ఎస్టేట్ మహారాణి వైరిచర్ల చంద్రముఖి మహాదేవి 1957 జులై 20న దూప, దీప నైవేద్యాల నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారన్నారు. అప్పటి నుంచి దేవస్థానం ఆధీనంలోనే ఆ భూములు ఉన్నాయని, వాటి ధరలు విపరీతంగా పెరగడంతో కొంతమంది రాజకీయ నాయకులు ఎలాగైనా కబ్జా చేయాలన్న దురుద్దేశంతో ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆ భూమి మీద వచ్చే ఆదాయం దేవునికి దీప, దూప నైవేద్యం కోసం ఉపయోగిస్తున్నారని, చంద్రముఖి దేవి మరణ అనంతరం ఆ భూములను తమకు అప్పగించాలని ట్రస్టీ వారు దేవస్థానం అధికారులను 1963లో కోరారని తెలిపారు. అయితే ఆ భూములు దేవస్థానానికే చెందుతాయని అధికారులు తెలియపర్చారన్నారు. దీనిపై ట్రస్టీ వారు కోర్టును ఆశ్రయించారని, కోర్టు విచారణ అనంతరం 1996లో దేవస్థానానికే ఆ భూములు చెందుతాయని స్పష్టమైన తీర్పు ఇచ్చిందని అన్నారు. అప్పటి నుంచి ఆ భూములను దేవస్థానం స్వాధీనం చేసుకొని చుట్టూ రక్షణ కంచె వేసి బోర్డులను ఏర్పాటు చేసిందన్నారు. సెక్యూరిటీని కూడా ఉంచిందన్నారు. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు 2022 నవంబర్ 27న కంచెను తొలగించే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇవేం రోడ్లురా బాబూ..!

60.30 కిలోమీటర్లలో అత్యవసర పనులు చేసేందుకు రూ.89.05 లక్షలు, రాష్ట్ర రహదారిలో 7.39 కిలోమీటర్లలో గోతులు పూడ్చడానికి రూ.11 లక్షలు, మరో 11 కిలోమీటర్లలో అత్యవసర పనులు చేసేందుకు రూ.29.45 లక్షలు అవసరమని ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. ప్రభుత్వం డబ్బులు విడుదల చేయకపోతే ప్రజలకు అవస్థలు తప్పేలాలేవు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించి, తొందరగా పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు.

భూములకు రక్షణ కల్పించండి

ప్రయత్నం చేశారని, నాడు ఆక్రమంగా కంచెలను తొలగించిన ఆరుగురిపై దేవస్థానం ఎసిపి శిరీష స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని తెలిపారు. ప్రభుత్వం మారిన వెంటనే నేడు దురాక్రమణ చెయ్యాలనే ఉద్దేశంతో ఈ నెల 27న కొందరు జెసిబితో సదరు భూమిని చదును చేస్తూ దేవస్థానం ఏర్పాటు చేసిన కంచెను, హెచ్చరిక బోర్డులను తొలగించి ఆక్రమించడానికి ప్రయత్నం చేశారన్నారు. సమస్యపై రెండు రోజుల నుంచి అనకాపల్లిలో తీవ్ర చర్చ జరుగుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎటువంటి ప్రకటనా చేయలేదన్నారు. వాళ్ల మౌనాన్ని బట్టి వాళ్ల పాత్రపైన అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అనకాపల్లి ప్రజానీకం ఆ భూమి ఆక్రమణపై తీవ్ర ఆవేదన, ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ దేవాలయ అధికారులను పిలిచి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, మండల కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్య బాబు, గంటా సుభాషిణి, ప్రజా సంఘాల నాయకులు గండి నాయినబాబు, డి.డి.వరలక్ష్మి, డి.శ్రీనువాసరావు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, దళిత బహుజన యూనియన్ కన్వీనర్ కొల్లి సత్యారావు పాల్గొన్నారు.

ప్రసాద్ రెడ్డి అక్రమాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ ప్రసాద్ రెడ్డి అక్రమాలపై తక్షణం విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని, వర్సిటీలో అక్రమంగా ఆయన సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలని ఆంధ్రా యూనివర్సిటీ పరిరక్షణ సమితి కార్యదర్శి పొన్నాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రసాదరెడ్డి అవినీతి, అక్రమాలపై నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి విచారణ జరపని కారణంగా యూనివర్సిటీలో ప్రజాస్వామ్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్, సభ్యులు దేవా పాల్గొన్నారు.

బొత్స రాజకీయాల నుంచి తప్పుకోవడం మేలు

ప్రజాశక్తి - విశాఖ జిల్లా కలెక్టరేట్ : మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొత్స ఉపాధ్యాయుల బదిలీలలో కొన్ని కోట్ల రూపాయలను వసూలు చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొంప సత్యనారాయణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ కె.గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలు నివాసం ఉన్నచోటనే పట్టాలు ఇవ్వాలి

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి మండలం 97వ వార్డు పరిధి 163 సర్వే నెంబర్‌లో పేదలు నివాసం ఉన్న దగ్గరే పట్టాలు ఇవ్వాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. దీనికి, స్పందించిన కలెక్టర్ పేదలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.జగన్, బి.రమణి, కాలనీ నాయకులు ఎం.గోపి, ప్రభుదేవా పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనతో యువకునికి గాయాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల పేరిట సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలకు ఊతమిచ్చే సంఘటనిది. సాగర్ నగర్ ప్రాంతంలో కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనతో ఒక యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. సాగర్ నగర్ గ్రామంలో సోమవారం సాయంత్రం 8 గంటల నుంచి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న ప్రభాకర్ అనే యువకుడిని కానిస్టేబుల్ వాహనం ఆపాలని సైగ చేశాడు. అతను బండి స్లో చేస్తుండగానే ఒక్కసారిగా కానిస్టేబుల్ వెంకటరావు ఆ వాహనాన్ని పక్కకు నెట్టేయడంతో ప్రభాకర్ తలకు తీవ్ర గాయమైంది. తాను మద్యం సేవించనప్పటికీ పోలీసులు దురుసు ప్రవర్తన కారణంగా గాయపడ్డానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ వినతులు

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విశాఖ కలెక్టరేట్ : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం యుటిఎఫ్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో ఇన్చార్జి డిఆర్ఒ సీతారామ మూర్తికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, కోశాధికారి కె.రాంబాబు, యుటిఎఫ్ జివిఎంసి సీనియర్ నాయకులు బి.జనార్ధన్, జిల్లా కార్యదర్శి రియాజ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

గాజువాక : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం ఎంఇఒ బి.విశ్వనాథానికి వినతిపత్రం అందజేశారు. జిఒ 117 రద్దుచేసి జిఒ 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హైస్కూల్స్‌లో రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : యుటిఎఫ్ ఆనందపురం మండల శాఖ ఆధ్వర్యాన ఎంఇఒ, ఎంపిడిఒ, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడరాము, మండల శాఖ అధ్యక్షులు ఎస్.కిరణ్ కుమార్, నాయకులు సత్యానంద్ పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన తెలుపుతున్న సెవెన్ హిల్స్ కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెవెన్ హిల్స్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మిక శాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు కొత్తగా వచ్చిన సెవెన్ హిల్స్ యాజమాన్యం కొత్త పద్ధతుల్లో వేధింపులకు గురిచేస్తోందని, తెల్లకాగితంపై సంతకాలు తీసుకుంటోందని, పెట్టకపోతే రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తోందని తెలిపారు. రాజీనామా చేసిన వారు రెండు నెలల జీతం యాజమాన్యానికి తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఆయాలు, స్వీపర్లు, బాయ్స్ వారి పనులన్నీ కలిపి ఒక్కరే చెయ్యాలని, పనిభారం పెంచాలని చూస్తున్నారని తెలిపారు. దీనికి లేబర్ అధికారులే పరిష్కారం చూపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ కార్మికుల నాయకులు నూకరాజు, నాయుడు, రమణ, పుష్ప, ఫెలోమీనా వేలగాని తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.పోలీసుస్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌పై దాడి ఘటన తీవ్ర సంచలనం రేకెత్తించింది. పోలీసుల కథనం మేరకు.. ఎంవిపి పోలీసుస్టేషన్ పరిధిలోగల ఆదర్శనగర్‌లో భార్యాభర్తల నడుమ వివాదం చోటు చేసుకుంది. దీంతో బాధితురాలు కనకమహాలక్ష్మి సోమవారం సాయంత్రం 112కి ఫోన్ చేశారు. ఆ కాల్ ఆధారంగా విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ రాజు నాయుడు ఘటనా స్థలానికి చేరుకొని వినయ్ అనే యువకుడిని మందలించాడు. మద్యం మత్తులో ఉన్న అతడు కానిస్టేబుల్ రాజు నాయుడును తీవ్రంగా గాయపరిచాడు. విషయం తెలిసి పోలీసులు వినయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

శ్రీ యశోదకృష్ణ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ యశోదకృష్ణ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శివాజీపార్క్‌లో జరిగింది. అధ్యక్షులు ముద్దాడ ఎల్లాజీరావు, ప్రధాన కార్యదర్శి బీసపు శ్రీనులు మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలైందన్నారు. సంఘం అభివృద్ధికి చేపట్టాల్సిన కర్తవ్యాలపై చర్చించారు. కార్యక్రమంలో కోశాధికారి పిల్లల మోహనరావు, ముఖ్య సలహాదారు ముద్దాడ శంకర్రావు పాల్గొన్నారు.

సేల్‌డీడ్ పోయినది

నేను **పి.శ్రీనివాసరావు,** తండ్రి మొగ్గం నాయుడు వయస్సు 47 సంగరాలు, నేను 14-07-2024 తేదీన మధురవాడ నుండి పి.ఎం.పాలెం వెళ్తుండగా నా ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ పోయినది. డాక్యుమెంట్ నెంబర్. **3913/2011** దొరికిన వారు దయచేసి ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పి.శ్రీనివాసరావు,
డోన.నెం. 9/15/56/4ఎఫ్,
బురుగుపల్లి విధి, శ్రీవల్లినగర్,
మధురవాడ, విశాఖపట్నం-48
సెల్: 77308 35558

IN THE COURT OF THE MACT, V ADDL.DISTRICT JUDGE CUM SPL WOMEN COURT : KHAMMAM
MATOP No.639/2022

Between:
Allika Nagalaxmi And Others
..... Claim Petitioners
And
Rokkala Rajesh And Others
.... Respondents

To
Respondent No.1
Rokkala Rajesh, s/o.Satyanarayana
Murthy age: 44 yrs. Occ: Advocate,
Driver of Innova Car, R/o H.No.14-454/1,
E Block, Laxminagar Gopalapatnam,
Visakhapatnam-27.

NOTICE

Take Notice that the above named claim petitioners filed the above OP against you and another for grant of compensation before the above said court the same is posted to 8-8-2024 for your appearance, you hereby directed to appear before the Hon'ble court on 8-8-2024 at 10.30 A.M in person or through an advocate without fail. If you failed the matter will be decided exparte against you.

//By order of the court //
POTLA VENKATA RAMANA
Advocate, Khammam
Cell No. 94403 50406

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJUWAKA
O.S. 326/2023

Between:
CANARA BANK,
Green City Branch,Gajuwaka,
Rep. by its Branch Manager
...Plaintiff-Bank

And:
M/s. Vinayaka Foot Lockers
(Foot Wear) & Another
...Defendants

SUMMONS

To,
D-1: M/s. Vinayaka Foot Lockers (Foot Wear), D.No.36-46-68, Rythu Bazar, Kancharapalem, Visakhapatnam.
D-2:Smt. M. Atchiyamma, W/o. late Majji Raju, D.No.37-11-168/2, NGGO's Colony, Near Water Planet, PR Gardens, Industrial Estate, Visakhapatnam-530007.

Please take notice that the above named plaintiff-bank has instituted the above suit against both of you for recovery of amount of **Rs.10,57,706/-** and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **14-08-2024** for your appearance on that day **10.30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
SUNKARA PADMAJA,
M. PARVATEESAM,
Advocates, Visakhapatnam-16

IN THE HONOURABLE COURT OF THE DISTRICT JUDGE AT VIZIANAGARAM.
I.A.No /2023 in O.P.No 1/2019.

Between:
Andhra Pradesh State Financial Corporation, (incorporated under The State Financial Corporation Act, 1951), Vizianagaram Branch Represented by its Branch Manager, Vizianagaram ......Petitioner
And:
1. M/s. Chekuri Chemicals Private Limited., Kovvada Agraharam Village of Poosapatirega Mandal, represented by its Director Sri Chekuri Venkatapathi Raju
2. Sri Chekuri Venkatapathi Raju
3. Sri Chekuri Sivaji Raju
4. Sri Yenugudati Narasimha Raju
5. Sri Chekuri Appala Narasimha Raju
6. Smt. Chekuri Sudharani
7. Smt. Chekuri Madhuri
8. Sri Penumatsa Srinivasa Raju
(Respondent no: 2 to 8 are the directors of the 1st respondent company) ....Respondents

To
THE RESPONDENT No 8
Sri Penumastsa Srinivasa Raju S/o. P. Lakshmipathi Raju, Business, residing at Door no: 38-19-10/3, Jyothi Nagar, Marripalem, Visakhapatnam.

Please take notice that the above named Petitioner instituted the above matter against you and the same stands posted on **9th day of August 2024 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES,
VIZIANAGARAM,
Ph: 9492019394.

మూసివేసిన రహదారిని తెరిపించాలి

ప్రజాశక్తి - విశాఖ డెస్క్ : ప్రైవేట్ స్థల యజమాని, జివిఎంసి అధికారుల మధ్య నెలకొన్న సమస్య వల్ల కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నెహ్రూ నవోదయ వద్ద శనివారం మూసివేసిన దారిని తక్షణమే తెరిపించాలని కె 1, కె2 కాలనీలతో పాటు అమరావతి కాలనీ, ఎన్‌టిఆర్ హుదూద్ ఇళ్ల ప్రజలు సోమవారం ధర్నా చేశారు. అనంతరం మధురవాడ వంతెన నుంచి జివిఎంసి జోనల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేశారు. జోనల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, కాలనీల పెద్దలు పి అవతార్ సింగ్, ఎస్‌డి బాబా, ఎస్‌కె.అమీర్ తదితరులు మాట్లాడుతూ, ఈ కాలనీల్లో నివసిస్తున్న వారంతా పేదలని, రహదారిని మూసివేయడంతో బస్సులు రాక కూలి పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్, విఎంఆర్‌డిఎ అధికారుల అలసత్వమే ఈ పరిస్థితికి కారణమని ధ్వజమెత్తారు. ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్, ఎసిపి లేక పోవడంతో సిసిపితో చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారితో సోమవారం సాయంత్రం చర్చలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.కేశవ, పావెల్, కె.పద్మ, ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

మూసివేసిన రహదారి వద్ద ధర్నా చేస్తున్న కాలనీల వాసులు

నేరాలు ఘోరాలు

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : యువతిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని పిఎం.పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నార్త్ ఎసిపి వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా బైతవరం గ్రామానికి చెందిన బొడ్డు దివ్య కొమ్మాది సమీపంలోని ఒక వసతి గృహంలో ఉంటూ స్థానికంగా ఉన్న స్వీట్స్ షాప్‌లో పనిచేస్తోంది. ఈ నెల 22వ తేదీన రాత్రి పది గంటల సమయంలో దుకాణం సమీపంలోని బాత్రూమ్‌కు వెళ్లింది. బాత్రూం నుంచి బయటకు వచ్చిన దివ్యపై వెనకనుంచి మధురవాడ భగవంతుడు కాలనీకి చెందిన చేవ్వేటి సురేష్ దాడిచేసి ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్ను పట్టుకొని పోయాడు. దివ్య అపస్మారక స్థితిలో పడిపోయింది. అర్ధరాత్రి తెలివి వచ్చాక వసతి గృహానికి వెళ్లి విషయం చెప్పింది. వసతి గృహం వార్డెన్‌తోపాటు మిగిలిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దివ్యను కెజిహెచ్‌కు తరలించారు. అనంతరం పోలీసులు విచారణ చేపట్టారు. బాధితురాలు ఫోన్ ఆధారంగా సత్తిబాబును పట్టుకొని విచారించారు. ఈ ఫోన్ ఓ ఇద్దరు వ్యక్తులు తెల్లటి స్కూటీపై వచ్చి పడేశారని, తాను తీసుకున్నానని సత్తిబాబు వివరించారు. ఫోన్ పడేసిన వ్యక్తి శ్రీనివాసనగర్‌కు చెందిన అప్పన్నగా గుర్తించి సిసి కెమెరాలు పరిశీలించారు. నిందితుడు సురేష్‌గా గుర్తించారు. నిందితుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడనే నెపంతో మానసిక ఆసుపత్రిలో చేర్చి సోమవారం ఇంటికి వచ్చాడు. నిందుతుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ, పద్మనాభం సిఐ శ్రీధర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులకు గీతం ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సు అభ్యసిస్తున్న అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) సోమవారం ముగిసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, గీతం అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్‌ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ శాంతి మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బోధించే అధ్యాపకులు నిరంతరం నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కోడ్ చెక్, పైథాన్ ట్యూటర్, కోపైలెట్, రెప్యూట్ కోడ్, కృత్రిమ మేధ వంటి అంశాలపై అధ్యాపకులకు నూతన పరిజ్ఞానాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) ప్రొఫెసర్ విజయ కుమార్ బోధించారు. కార్యక్రమంలో సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీశ్వరి కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ హైమా పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందికి జరిమానా విధిస్తూ సోమవారం భీమిలి 15వ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు హెచ్చరించారు.

300 పశువులకు టీకాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలో సోమవారం 300 పశువులకు ఉచితంగా లంపి స్కిన్ వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. పశువులకు వ్యాధులు రాకుండా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీను, బాలు, కల్యాణ్ పాల్గొన్నారు.

కల్వర్టును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీ గొట్టిపల్లి వారి కల్లాలు వద్ద శిథిలమైన కల్వర్టును టిడిపి నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు చొరవతో ఇరిగేషన్ అధికారులు విజయ్‌కుమార్ పరిశీలించారు. నిర్మాణానికి రూ.20 లక్షల వరకు అవుతుందని అంచనా వేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

ప్రణాళికతో భీమిలి అభివృద్ధి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

జోనల్ కార్యాలయ భవన ప్రారంభంలో గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రణాళికాబద్ధంగా భీమిలిని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి నిధులు రూ.50 లక్షలతో పునర్నిర్మించిన జోనల్ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే గంటాతో కలిసి జివిఎంసి మేయర్ జి హరివెంకటకుమారి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, చారిత్రక పట్టణంగా భీమిలి ప్రాచుర్యం పొందినప్పటికీ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి ఆశాజనకంగా లేదన్నారు. భీమిలి టౌన్ అభివృద్ధికి ప్రధానమైన రహదారుల విస్తరణ అనివార్యమని స్పష్టం చేశారు. విస్తరణ సందర్భంగా ఇళ్లు, వ్యాపార సంస్థలు, ఇతరత్రా ఆస్తులు కోల్పోయిన వారికి మెరుగైన పరిహారం ఇస్తామని చెప్పారు. జెడ్సీ కె.కనకమహా లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో 2, 3, 4 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, దౌలపల్లి ఏడుకొండలరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర కుమార్, కొప్పల రమేష్, పి.లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను గంటా అందజేశారు. ప్రిన్సిపల్ సిహెచ్.సూర్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతగానో ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కార్పొరేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టిడిపి విజయోత్సవ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో టిడిపి మండల కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 30వ తేదీన నిర్వహించే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహ రాజు కోరారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో సోమవారం పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పంచాయతీ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆనందపురం మండలం, పెద్దిపాలెం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విజయోత్సవ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు సరగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎఎన్ రాజు

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. సాయిరాంకాలనీలో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ పనులను గత ప్రభుత్వం నిలిపివేసిందని, దాన్ని పూర్తిచేయాలని, కొమ్మాది కూడలి సర్వీస్ రోడ్డు డ్రైనేజ్ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని, బొట్టవానిపాలెంలో సామాజిక భవనానికి గతంలో శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు పనులు జరగలేదని, ఆ నిర్మాణం చేపట్టాలని, వార్డు పరిధిలోని కార్పెంటర్ కాలనీ, వికలాంగుల కాలనీ, స్వయంకృషినగర్, అయ్యప్పనగర్, వివేకానందకాలనీ, గాంధీనగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, శివశక్తినగర్, శారదానగర్, సాయిరాం కాలనీ కొండ ఎగువ భాగంలో రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేయాలని, మారికవలస ఓజోన్ వేలి హుదూద్ కాలనీ, జాతీయరహదారి నుంచి పరదేశిపాలెనికి వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు, అయోధ్యనగర్‌లో మౌలిక సదుపాయాలు, స్వతంత్రనగర్‌లో ఓపెన్ జిమ్ పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు.

వెల్లంకిలో బస్ షెల్టర్ కోసం వినతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ జాతీయ రహదారి పక్కన బస్ షెల్టర్ నిర్మాణం చేయాలని కోరుతూభీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కూటమి నాయకులు వినతిపత్రం అందజేశారు. బస్టాప్ లేక వెల్లంకిలోని విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు, చిరువ్యాపారస్తులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు గోవింద్ బాలు, చెన్న నర్సింగరావు, చెన్న రాజు, రామిశెట్టి శ్రీనివాసరావు, కంటిమహంతి శివప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను 33 రోజులకు గాను సోమవారం దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాస్ మూర్తి పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. రూ.1 కోటి 97 లక్షల 6 వేల 300 నగదు, బంగారం 100 గ్రాములు, వెండి 11 కిలోల 800 గ్రాములుచ విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు హారం కానుక

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్నకు మధురవాడ దుర్గానగర్‌కు చెందిన కె సూర్యచంద్రరావు 350 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి సోమవారం అందించారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం బేడా మండప ప్రదక్షిణ చేయించి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎన్.ఆనంద్‌కుమార్ సత్కరించి స్వామి ప్రసాదాలను అందజేశారు.

ఇళ్లు ఇచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి- విశాఖ డెస్క్ : భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారంగా ఇస్తామన్న ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం ఆపేదిలేదని కెవిపిఎస్ నాయకులు సియ్యాద్రి పైడితల్లి ఉద్ఘాటించారు. బక్కన్నపాలెంలోని హుదూద్ ఇళ్ల వద్ద చేపట్టిన ఆందోళన సోమవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా పైడితల్లి మాట్లాడుతూ, రైతులంతా పదేళ్లుగా పోరాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల ప్రతినిధులు బంక పోతురాజు, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, పిల్లా అప్పలనరసమ్మ, డి.తులసి, కె.కిషోర్, గణేష్, ఎస్ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 10 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)లో జెడ్సీ కె.కనకమహాలక్ష్మికి 10 అర్జీలు అందాయి.

వడ్లపూడి రైల్వే వేగన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడి రైల్వే వేగన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వడ్లపూడి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు వద్ద కార్మికుల ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాంబాబు మాట్లాడుతూ, రైల్వే వేగన్ వర్క్ షాపులో పనిచేస్తున్న కార్మికులకు జిఒ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ అమలు చేయాలని, ప్రతినెలా పదో తేదీన జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షులు వివి రాజు, ఉపాధ్యక్షులు అవతారం, వెంకటేశ్వరరావు, సతీష్ రాజు పాల్గొన్నారు.

వడ్లపూడి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మరణిస్తూ... ముగ్గురికి జీవితం

ప్రజాశక్తి -గాజువాక : 'తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలను బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కాపాడాడు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి... నాతయ్యపాలెంలో నివాసముంటున్న జె.రాముునాయుడు (68) బ్రెయిన్‌లో రక్తస్రావంతో ఈ నెల 27వ తేదీన స్పృహ కోల్పోయాడు. అతన్ని వెంటనే స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కి తరలించారు. వైద్యులు రెండు రోజుల పాటు శ్రమించారు. కానీ శనివారం రాముునాయుడు బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆ తర్వాత అవయవదానంపై వారి కుటుంబ సభ్యులకు వైద్యులు అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో కిడ్నీలు, కాలేయం దానం చేయడంతో మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపారు. జీవన్‌దాన్ ఆధ్వర్యాన అవసరం ఉన్నచోటికి కిడ్నీలు, కాలేయం తరలించినట్లు జీవన్‌దాన్ స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పార్కులో చెత్తను పరిశీలిస్తున్న ఎఎంఒహెచ్ ప్రసాద్, సిబ్బంది

పార్కులో చెత్త తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి రాజేంద్రనగర్ పార్కులో చెత్తను జివిఎంసి సిబ్బంది సోమవారం తొలగించారు. 'డంపింగ్ యార్డుగా పార్కు స్థలం!' శీర్షికన ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జివిఎంసి అధికారులు స్పందించారు. జివిఎంసి ఎఎంఒహెచ్ ప్రసాద్ సిబ్బందితో వచ్చి సోమవారం పరిశీలించారు. పార్కులో ఉన్న బడ్డీలను, చెత్తను తొలగింపజేశారు. మరో రెండు మూడు రోజుల్లో మొత్తాన్ని శుభ్రం చేయిస్తామని ప్రసాద్ తెలిపారు.

11న ప్రతిభావంతులకు పట్టాభిషేకం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతిభ, క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన కళ రంగాలతోపాటు వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులకు పట్టాభిషేకం - 2024 పేరున అవార్డులు ప్రదానం చేసే 24వ వార్షికోత్సవ కళా సంబరాల కార్యక్రమాన్ని ఆగస్టు 11వ తేదీన ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ తెలిపారు. ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు, ప్రోగ్రాం కన్వీనర్ వర్రే నాంచారయ్యతో కలిసి సోమవారం దాడి సత్యనారాయణ కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక రంగాలలో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి కీర్తిశేషులైన దేశ నాయకుల పేరున అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీ భరత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలు సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో 95 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, నాయకులు అక్కరమాని విజయనిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు, గండి వంశీ, గొంప సత్యనారాయణ, పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యాన వార్డు కార్యాలయంలో విశాఖ ఎంపీ మతుకుమిల్లి భరత్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ప్రెసిడెంట్ ముక్కా కిషోర్‌కుమార్, టిడిపి సెక్రటరీ పెద్దలక్ష్మణ్, శ్రీనివాస్, నర్సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వార్డు సమస్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సోమవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసి వార్డులోని సమస్యలను వివరించారు. అనంతరం సమస్యలపై వినతి పత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు గోవింద్ తెలిపారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి

ప్రజాశక్తి-పెందుర్తి : అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, విద్యుత్, హౌసింగ్, వ్యవసాయ, మైనింగ్ శాఖల్లో ఇప్పటి వరకు జరిగిన పనితీరు, పెండింగ్ పనులను అధికారులనడిగి తెలుసుకున్నారు. గతంలో జరిగిన పనులకు కొన్ని బిల్లులు రాలేదని పెదగాడి సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి వాటర్ ట్యాంకు మెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచాలని ఎంపిటిసి సభ్యులు కోరారు. ఎన్‌టిఆర్ కాలనీలో వర్షం పడితే నీరు నిల్వ చేరుతుందని, సరైన డ్రెయినేజీ, రిటైనింగ్ వాల్ నిర్మించాలని, తాగునీటి బోరు ఏర్పాటుచేయాలని కోరారు. రోడ్లు గుంతలుగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జుత్తాడ సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. హౌసింగ్‌పై సమీక్షలో ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో పంట సాగు, సబ్సిడీల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రతి గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

అగనంపూడి జూనియర్ కళాశాలలో పుస్తకాలను పంపిణీచేస్తున్న పల్లా

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి ప్రశాంతినగర్, గోపాలపట్నం ఎంపిపి స్కూల్ విద్యార్థులకు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు విద్యా కానుక కిట్లు యూనిఫామ్, బ్యాగులు, పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ తరగతి గదులను, అంగన్‌వాడీ స్కూల్‌ను, దెబ్బతిన్న గోడలను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటానని పాఠశాల సిబ్బందికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, కూటమి నాయకులు నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మూర్తియాదవ్, నరిపిన్ని సత్తిరాజు, మూర్తి పట్నాయక్, నందవరపు సోములు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి జూనియర్ కళాశాలలో పుస్తకాల పంపిణీ

ఉక్కునగరం : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కాలేజీ అభివృద్ధికి, అధ్యాపకుల నియామకానికి, ఇతర సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడతానని చెప్పారు. కాలేజీలో ప్లాస్టిక్ కుర్చీల కోసం ఆశ రాజా షైనింగ్ సొసైటీ కార్యదర్శి పులగపురి ఆశాలత రూ.5000 చెక్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా కాలేజీ ప్రిన్సిపల్ జి.సుధాకర్‌బాబుకు అందజేశారు. ఎమ్మెల్యేను కాలేజీ అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఎడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, టిడిపి నాయకులు మాడిసి వెంకట్రావు, బిజెపి నాయకులు కోసూరి తాతారావు జనసేన నాయకులు నారపిన్ని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి జారుకుంటున్న నేతలు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని వైసిపి నాయకులు టిడిపి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసిపి నుంచి గెలిచిన వార్డు కార్పొరేటర్లు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుతో మంతనాలు జరుపుతున్నారు. దీనికి ముందు జనసేన పార్టీలో చేరుదామని వీరంతా వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఆయన నిరాకరించడంతో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును కలిశారు. ఆగస్టు తర్వాత పార్టీలో చేర్పించుకుంటామని, అంతవరకు టిడిపి పనిచేయండి ఎమ్మెల్యే గణబాబు కార్పొరేటర్లకు చెప్పినట్లు సమాచారం. వైసిపి కార్పొరేటర్లు గత ప్రభుత్వంలో చేసిన దందాలను కప్పిపుచ్చుకోడానికే అధికార పార్టీలోకి జారుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ కార్పొరేటర్లు ఇంతవరకు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆడారి ఆనంద్‌కుమార్ వెనుక తిరిగి బాగా డబ్బులు సంపాదించుకొని, అధికారం పోయేసరికి టిడిపిలోకి జారుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇటువంటి వారిని నమ్మకూడదని ఈ కార్పొరేటర్ల దందాలు వెలికితీయాలని పలువురు కోరుతున్నారు.

తహశీల్దార్ ఆనంద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం తహశీల్దార్‌గా ఎం.ఆనందకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పద్మనాభం ఎంపిపి రాంబాబు, జడ్‌పిటిసి ఎస్.గిరిబాబు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కాల నగేష్‌కుమార్, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -గాజువాక : అభివృద్ధి, సంక్షేమంలో గాజువాక నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ లోవలో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ తప్పకుండా అమలుచేస్తానని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన జిఒ 296 ఇళ్ల పట్టాలపై క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా ప్రణాళికతో ముందుకు నడుస్తానని చెప్పారు. ప్రజల సహకారంతో టోల్‌గేట్ తొలగించామని, దానిపై ఎవరు డ్రామాలాడినా తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, దువ్వి శ్రీనివాసరావు, బిఎఫ్.కొండబాబు, జాజులు, గంగరాజు, పల్లా రమణ పాల్గొన్నారు.

ఎల్లో డే సెలబ్రేషన్స్

ప్రజాశక్తి -గాజువాక : చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి ఎల్లోడే ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, పసుపు రంగు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పసుపు రంగు సంతోషానికి, వినోదానికి, శుభ ప్రధానికి చిహ్నమని తెలిపారు. అందరూ సంతోషంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి, పసుపు రంగు పండ్లు, పువ్వులు, వివిధ రకాలైన వస్తువుల ఆకృతులు తయారుచేసి స్కూల్‌కు హాజరయ్యారు. పసుపు రంగు విశిష్టతను పాటల రూపంలో వివరించి, డ్యాన్సులతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, శైలజ, హేమ, మణి, రాణి, సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిలిచిన క్లాప్ వాహనాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోన్ పరిధిలో తడి - పొడి చెత్త సేకరణకు సంబంధించి క్లాప్ ఆటోలను సోమవారం నిలిపివేశారు. గాజువాక జోనల్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ, క్లాప్ ఆటో లోడర్స్‌గా పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. దీనిపై ఈ నెల 31వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. క్లాప్ ఆటోలు లోడర్స్, కొత్తగా చేరిన డే అండ్ నైట్ పారిశుధ్య కార్మికులు, సీజన్ మలేరియా సెక్షన్, డైలీ వేజ్, కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరు కావాలని కోరారు.

'యువతకు స్ఫూర్తి షేక్ ఆయేషా'

ప్రజాశక్తి-పెందుర్తి : రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల యూత్ మినిస్టర్స్ సదస్సులో తన వాణి వినిపించి దేశానికి గర్వకారణంగా నిలిచిన షేక్ ఆయేషా యువతకు స్ఫూర్తిదాయకమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీవల్లీ పేర్కొన్నారు. రష్యా సదస్సులో పాల్గొని స్వగ్రామమైన పెందుర్తి మండలం, సరిపల్లి పంచాయతీ నీలకంఠాపురం వచ్చిన ఆయేషాను షఫీతో పాటు నూర్ భాషా, సంఘం ప్రెసిడెంట్ షేక్‌ఖాన్ సాహెబ్, జనరల్ సెక్రటరీ షేక్ సాహుల్, ముస్లిం పెద్దలు షేక్ రహిమాన్, షేక్ షాకీర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆలోచనా సరళిని అభినందించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ, సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఈ సందర్భంగా షేక్ ఆయేషా మాట్లాడుతూ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చదువుతున్నానని, బ్రిక్ సదస్సులో నేను పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని వినూత్న నిరసన

కంచాలు, గ్లాసులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-దేవరపల్లి

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దేవరపల్లిలో సోమవారం కంచాలు పట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తిండైనా పెట్టండి, బకాయిలైనా చెల్లించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా నాయకులు బిటి.దొర మాట్లాడుతూ జిల్లాలోని దాదాపుగా నాలుగు వారాలు నుండి ఎనిమిది వారాలు వరకు రూ.50 కోట్లు మేరకు బకాయిలు ఉన్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే కూలీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్లో ఉపాధి హామీకి కేటాయింపులు తగ్గించిందని, రూ.93 వేలు కోట్లు ఉన్న బడ్జెట్‌ను రూ.86 వేల కోట్లకు కుదించిందని పేర్కొన్నారు. తక్షణమే కూలి డబ్బులు చెల్లించకుంటే జిల్లా ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డుమెంబరు వంది దుర్గా, ఉపాధి హామీ కూలీలు బి.నాగేశ్వరరావు, కె.రాము, బి సూర్యనారాయణ, పి,దేముడు, సోముల సింహాచలం, వంది శ్రీరాం, అధిక సంఖ్య మహిళా కూలీలు పాల్గొన్నారు.

11 వారాల బకాయిల చెల్లించాలని...

మునగపాక : మండలంలోని ఉపాధి హామీ కూలీలకు 11 వారాలుగా బకాయి ఉన్న కూలీ డబ్బులు చెల్లించాలని కోరుతూ ఎంపిడిఓ, ఉపాధి హామీ కార్యాలయం వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 11 వారాలుగా బకాయిలు చెల్లించకుండా కూలీల బతుకులతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. మండలంలో 18 గ్రామాలకు సుమారు రూ. 2 కోట్ల 15 లక్షలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల విడుదలైన నామమాత్రపు నిధులు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి పేదలను ఆకలి బాధలకు గురిచేయడం అన్యాయమన్నారు. అన్ని వారాల పాటు వేతనాలు చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వారం లోగా బకాయిలు చెల్లించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఓ, ఉపాధి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, టెక్కలి జగ్గ అప్పారావు, లక్ష్మణరావు, శివ, రాము, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో ఆందోళన చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. సోమవారం చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి చదువుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రైవేటు పాఠశాలలు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ విద్యను నైపుణ్యాన్ని పెంచే విధంగా పేద విద్యార్థులకు చదువు ఉచితంగా అందేలా ప్రభుత్వాన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు, రాజకీయవేత్త కొరుకొండ కాశీ మృతి ఈ ప్రాంతానికి తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. సోమవారం కొరుకొండ కాశీ సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మలసాల రమణారావు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, మలసాల కుమార్ రాజా, మలసాల కిషోర్, కొణతాల భాస్కరరావు, పెద్దిశెట్టి గోవిందు, కలగా గున్నయ్య నాయుడు, పలకా రాము, పలకా సత్యనారాయణ, దాడి కుమార్, పెద్దాడ రమాశంకర్, ప్రభాకర్, కసుబుడ్డి శంకర్, కాండ్రేగుల రాము, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పేర్లు మార్పు అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పలు పథకాలకు గత ప్రభుత్వం పెట్టిన పేర్లు మార్పు చేసి, విద్య రంగంలో విశేష సేవలందించిన వారి పేర్లను నామకరణం చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో నూతన పథకాల పేర్లను ప్రకటించడం హర్షనీయమన్నారు.

మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పీలా ఆశ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పీలా ఆశని నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ వచ్చేవరకు పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, చీరాల సుచరిత, సౌజన్య, లావణ్య మరియు ఉపాధ్యాయులు అందరూ ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఇన్ఛార్జి ప్రిన్సిపాల్‌కి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి శుభాకాంక్షలు తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కుష్టు వ్యాధి లక్షణాలు నివారణ వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంపై పరచలేని రాగి రంగులో మచ్చలు, కాళ్ల చేతులు పట్టు తప్పినట్లు ఉన్నట్లయితే కుష్టి వ్యాధి లక్షణాలుగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేసినట్లయితే శరీరంలో నాడులు దెబ్బతిని అంగవైకల్యానికి దారి తీయ వచ్చునన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులను అందిస్తామని చెప్పారు.

మార్చురీ పక్కన అన్న క్యాంటీన్ సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి వద్ద మార్చురీ పక్కన అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చేయడం సరికాదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఈ మేరకు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శవాలకు పోస్టుమార్టం చేసే మార్చురీ గోడకు అడ్డుగా రేకు వేసినంత మాత్రాన దుర్వాసన ఆగదని, మార్చురీ నుంచి వచ్చే దుర్గంధం వలన క్యాంటీన్ దగ్గర భోజనం చేసేవారికి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. పోస్టుమార్టం జరిగే సమయంలో దోమలు, ఈగలు యాక్సిడెంట్ అయి చనిపోయిన శవాలపై వాలి భోజన సామాగ్రిపై వాలితే ఇన్ఫెక్షన్స్ ఏర్పడతాయని, దానివలన ప్రజల ఆరోగ్యాలు పాడవుతాయని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇక్కడ నుంచి అన్న కాంటీన్ అయిన మార్చాలని, లేదా మార్చురీని అయిన లోపల ఎక్కడైనా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారి వద్ద నుంచి సోమవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ స్వీకరించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో విజయ పతాకం ఎగరవేయాలి

కలెక్టరేట్లో సెల్ఫీ పాయింట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి

పారిస్ వేదికగా జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు విజయాలు సాధించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ క్రీడలపై ప్రజల్లో అవగాహన, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు గాను చీర్ ఫర్ భారత్ పేరుతో సెల్ఫీ పాయింట్‌ను కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సెల్ఫీ పాయింట్‌ను కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో ఒలింపిక్స్ క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకుగాను పాఠశాలల్లో, కళాశాలల్లో క్విజ్, సెమినార్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేయడంతో పాటు క్రీడల పట్ల అవగాహన పెంపొందించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, ఎల్.వి.రమణ, శిక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నేత శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా కార్మిక వ్యతిరేక బడ్జెట్‌పై అనకాపల్లి గవరపాలెం సంతోషిమాత ఆలయం మస్టర్ పాయింట్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగా, ప్రజలపై భారాలు వేసేదిగా, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చేదిగా ఉందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్లో కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు లేవని, కొత్తగా ఉపాధి కల్పించడానికి తీసుకొచ్చిన అంశాలు ఆచరణలో కార్పొరేట్ కంపెనీలకే లాభాలు తెచ్చిపెడతాయని మండి పడ్డారు. కార్మిక రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధులు అప్పుగా ఇస్తామని చెప్పారని, విభజన హామీల అమలులో ఎక్కడ డబ్బులు విదల్చలేదని వాపోయారు. కార్యక్రమం సంఘం నాయకులు బి రాము, సంతోష్, వాసు, పోలరావు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రతులను స్థానిక మెయిన్ రోడ్‌లో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, రైతు నాయకులు శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి బడ్జెట్ వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతానికి మరొకసారి అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల్లో కేంద్ర బిజెపి ప్రభుత్వానికి గ్రామీణ ప్రజలు బుద్ధి చెప్పినా దానిలో మార్పు రాలేదన్నారు. ప్రజలు, కార్మికులు, రైతాంగం దీనికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో మరింత మంది పాల్గొని బిజెపి ప్రభుత్వానికి తమ వ్యతిరేకత తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మజీ ,రాము, రమణ, సూరిబాబు, మద్దాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలతో పంటలకు నష్టం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. ప్రతిరోజు కురిసిన వర్షానికి రైతుల వేసిన వరి నారుమల్లు నీట మునిగిపోవడంతో వరి ఆకులు చనిపోయాయి. దీంతో రైతులు మరలా రెండోసారి విత్తనాలను కొనుగోలు చేసుకుని వరి ఆకు నారుమళ్ళను వేసుకున్నారు. దీంతో వరి నాట్లు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఎర్రవాయి ప్రాంతంలో అధికంగా ఉంది. అలాగే మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం, దిబిడి, బుచ్చయ్యపేట, రాజాం తదితర గ్రామాల్లో రైతులు మినుము, పెసర, బొబ్బర తదితర పంటలు వేశారు. ఈ వర్షాల వల్ల ఆ పంటన్నీ పాడైపోయాయి. మినుము, పెసర, బొబ్బర పంటలు కాయలు కాసి పక్వానికి వచ్చాయి. రైతులు ఈ కాయలను కోత కోసే సమయంలో వర్షాలు కురవడంతో కాయలు మొక్కలు మొలిసాయి. దీంతో పప్పు పంటలు కూడా చేతికి అందకుండా పోయాయి. మొత్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

నీటిమునిగి చనిపోయిన వరి నారు

మాధురి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలి

- పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము డిమాండ్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

తీయా నయూన్ గార్మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో నక్క మాధురి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. అచ్చుతాపురంలో సోమవారం వారు మాధురి ఆత్మహత్యపై మాట్లాడారు. తీయా నయూన్ గార్మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో మునగపాక మండలం, అరబ్బుపాలెం గ్రామానికి చెందిన నక్క మాధురి యాజమాన్యం వేధింపులకు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిందని రాము తెలిపారు. బ్రాండిక్స్ అపరల్ సిటీ పరిధిలో ఏర్పడిన ఈ పరిశ్రమలో గత కొంతకాలంగా ఆమె పనిచేస్తుందన్నారు. ఆమెను వేధింపులకు గురి చేయడం వలన మృతి చెందిందని పేర్కొన్నారు. మహిళా కార్మికులపై నిత్యం పరిశ్రమ యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. యాజమాన్యం కార్మికులపై ఒత్తిడి చేయడంతో మహిళా కార్మికులు మానసి క్షోభకు గురవుతున్నారని చెప్పారు. ఎక్కువ పని చేయించుకుంటూ తక్కువ జీతం చెల్లిస్తున్నారని ప్రశ్నిస్తే విధులు నుండి తొలగిస్తున్న సంఘటనలో అనేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. బ్రాండిక్స్ యాజమాన్యం నిబంధనలను తుంగలో తొక్కి వాళ్ల ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని చెప్పారు. మహిళలతో రాత్రి వేళల్లో విధులు చేయించడం చట్ట వ్యతిరేకమైనప్పటికీ చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. ఇటువంటి సంఘటనలో పునరావృతం కాకుండా కార్మికుల కష్టాలు బాధలు చెప్పుకునే స్వేచ్ఛ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోము నాయుడు, కాశి నాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్మైలెక్స్ ఫార్మా ప్రమాదాలపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మసిటీలో స్మైలెక్స్ ఫార్మాలో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కి ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఈ పరిశ్రమలో వరుస ప్రమాదాలకు నిలయంగా మారిందని, భద్రతా ప్రమాణాలు పూర్తిగా గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమలో గతంలో జరిగిన ప్రమాదంలో పెదగంట్యాడ మండలం మురుబై గ్రామానికి చెందిన కార్మికుడు మృతి చెందాడని, మరో ప్రమాదంలో అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన కార్మికుడు మృతి చెందాడని, ఇప్పుడు జరిగిన ప్రమాదంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కబీరాజా సాహెూ మృతి చెందాడని తెలిపారు. ఈ ప్రమాదాలు అన్నింటిలోనూ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, నిర్లక్ష్యం ఉందని పేర్కొన్నారు. వలస కార్మికుల చట్టం అమలు చేయడం లేదని, ఈఎస్ఐ, పిఎఫ్, కనీస వేతనాలు చట్టం అమలకు నోచుకోవడం లేదని తెలిపారు. కబీరాజా సాహెూకి ఎంత నష్టపరిహారం చెల్లించారో కూడా వెల్లడించలేదన్నారు. వలస కార్మికుల్ని అత్యంత చులకనగా నిర్లక్ష్యంగా చూస్తున్నారని, కార్మికులకు చనిపోయిన తగిన నష్టపరిహారం చెల్లించడం లేదని తెలిపారు. ఈ పరిశ్రమలో భద్రత ఆడిట్ నిర్వహించాలని, పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి కోరారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న దేముడునాయుడు తదితరులు

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవోకి, స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐకి సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి దేవుడునాయుడు, అల్లూరి ప్రజాసంఘాల అభివృద్ధి వేదిక అధ్యక్షుడు భూపతి అప్పారావు, సంఘ నాయకులు కెవి రమణ, వై శ్రీనివాసరావు, సిహెచ్ రామకృష్ణ, సూరిబాబు, నూకరాజు తదితరులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంబిల్లి పంచాయతీలో ప్రతి మంగళవారం సంత జరుగుతుందని, సంత మార్కెట్ రోడ్డుమీదకు రావడం, నేవీ నిర్మాణ పనులు చేస్తున్న భారీ వాహనాలు, రాళ్ల లోడ్లతో భారీ లారీలు తిరగటం వలన ట్రాఫిక్ సమస్య పెద్ద ఎత్తున ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీని వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారీ వాహనాలు అత్యంత వేగంతో వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాంబిల్లి గ్రామంలో పారిశుధ్య పనులు చేసే కార్మికుల లేక పారిశుధ్యం లోపించి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక లేక నిలిచిన గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఇసుక అందుబాటులో లేక పలు గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి కూటమి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా ఇసుకను కావలసిన వారికి అందజేస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక కొరత ఉండడం వలన ఆ సమయంలో మంజూరైన జగనన్న ఇల్లులతోపాటు ప్రజలు సొంతంగా నిర్మించుకుంటున్న ఇల్లులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీ మేరకు ఇసుక అందించడం లేదని పేర్కొన్నారు. దీంతో గృహ నిర్మాణాలు ఆగిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వారి కుటుంబాలు ఆకలితో అలమడిస్తున్నాయని వాపోయారు. గృహ నిర్మాణాలు జరుగుతుంటే తాపీ మేస్త్రీతో పాటు, సెంట్రింగ్ పనివారు, కార్పెంటర్లు, పెయింటర్లు ఇలాగా అనేకమందికి పని దొరుకుతుందని చెప్పారు. నూతన ప్రభుత్వం వెంటనే స్పందించి ఉచిత ఇసుకను లబ్ధిదారులకు అందజేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ లేఅవుట్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని సబ్బవరం రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 274 /20, 21, 24, 25 ,26, 30, 31 సబ్ డివిజన్ నెంబర్లలోగల భూముల్లో ఒక రియల్టర్ పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా లే ఔట్ వేసి ప్లాట్లు విక్రయించారని, ఆ యజమానిపై చర్యలు తీసుకోవాలని బలిరెడ్డి అప్పారావు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్థానిక ఏవో షేక్ బాబురావు, ఈఓఆర్‌డి మహేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైన తెలిపిన రెవెన్యూ నంబర్లను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. తక్షణమే లేఔట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రత్యేక అవసరాల పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సహిత విద్యా విభాగం కోఆర్డినేటర్ బి శకుంతల కోరారు. సోమవారం ఆమె మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక అవసరాల గల పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల అభివృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై తగు సలహాలు సూచనలు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి 1, 2 డివిడి ప్రసాద్, సత్యనారాయణ, సహిత ఉపాధ్యాయురాలు సిహెచ్ కన్నమ్మ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ వద్ద శారద నది పరివాహక ప్రాంతంలో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు టిడిపి సీనియర్ నాయకులు కోమార బాబురావు తమ అనుచరులతో వెళ్లి పట్టుకొని దేవరాపల్లి ఎస్సై డి నాగేంద్రకు సమాచారం ఇవ్వడంతో ఆయన తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రాత్రులు తరలించుకుపోయినా పోలీసులు పట్టినట్టు వ్యవహరిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. వారం క్రితం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు లేకుండా విడిచిపెట్టడం జరిగిందని, అక్రమ ఇసుక వ్యాపారానికి పోలీసులు అండదండలు ఉన్నాయని ఆరోపించారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగా పోటీల్లో 'శ్రీకృష్ణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన విశాఖపట్నం జిల్లా యోగా ఛాంపియన్షిప్-2024 పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సెంటర్ నుండి 18 మంది పాల్గొన్నారు. పోటీల్లో గగనం ప్రసన్న గోల్డ్ మెడల్ ఫస్ట్ ప్రైస్ (8 -10 ఏజ్ గ్రూప్), బొడ్డు జయశ్రీ గోల్డ్ మెడల్ ఫస్ట్ ప్రైస్ (10 -12 ఏజ్ గ్రూప్), మాదేటి వైష్ణవి గోల్డ్ మెడల్ ఫస్ట్ ప్రైస్ (18 -21 ఏజ్ గ్రూప్), బుదిరెడ్డి నరసింగరావు గోల్డ్ మెడల్ ఫస్ట్ ప్రైస్ (40 సంవత్సరాలు ఏజ్ గ్రూప్) బుదిరెడ్డి నాగమణి (45 సంవత్సరాలు ఏజ్ గ్రూప్) నంద్యాల హేమ వెంకట్ (ఎనిమిది- పది సంవత్సరాలు ఏజ్ గ్రూప్)ప్రైజులు గెలుచుకున్నారు. వారిని యోగా గురువును కర్రి జోగి నాయుడు, కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి గణేష్, అజయ్, కోన అప్పారావు అభినందించారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : పారిశుధ్య పక్షోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల సెంటర్లో మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్ వి వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు, నిర్వహణ, వర్షపు నీరు, మురుగు నీరుపోవడానికి డ్రైనేజి కాలువల ఏర్పాటు వంటివి పంచాయతీలు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పక్షోత్సవాలలో ఆగస్టు 10 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ మంగతాయారు, ఐకెపి ఏపిఎం వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు

అంగన్వాడీ ఆయా మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన అంగనవాడీ ఆయా బొడ్డేడ దేవకి రమణమ్మ (45) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా జీర్ణ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్తతో పాటుగా ఒక పాప, బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, గ్రామంలోని పలువురు నాయకులు, అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకులు, టీచర్లు, ఆయాలు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు.

పులుల సంరక్షణపై సదస్సు

ప్రజాశక్తి చోడవరం, చోడవరం రూరల్ : ప్రపంచ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్, వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ జీవావరణ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత, సంరక్షణ గురించి వివరించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి ఐవివి సత్యవతి మాట్లాడుతూ అడవుల సంరక్షణ అటవీ ఉత్పత్తుల సంరక్షణ, అటవీ జంతువుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపారు. అనంతరం జువాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ వి రత్నభారతి, విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ పులుల సంరక్షణ అనే విషయాల గురించి గురించి క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను.

బయ్యవరం పాఠశాలకు దాతల వితరణ

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పేటబయ్యావరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం దాతలు విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ గెంజి శ్రీనివాసరావు తన వంతు విరాళంగా పాఠశాలకు రెండు ఫ్యాన్‌లు అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో యడ్ల చినబాబు, వూటకూటి సత్యనారాయణ,మొగ్గా బాబూరావు, యడ్ల నానాజీ, గుప్తా, వెంకటేశ్వరరావు, గెంజి రాము,లోవరాజు పాల్గొన్నారు.

కరాటేలో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : ఇటీవల జరిగిన జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని బయ్యావరం ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతభ కనబర్చారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఈ విద్యార్థులకు సోమవారం అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం.రమేష్ పర్సనల్ పిఏ వినయ్ చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌లు దేవర చిరంజీవి, గొల్లవిల్లి నానాజీ పాల్గొన్నారు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నాణ్యతా లోపంతో నిర్మాణాలు

-వర్షాలకు గోడలు తడిచి కారుతున్న వైనం- తడిసి ముద్దవుతున్న మందులు
-పని చేయని మరుగుదొడ్లు-ఇదీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దుస్థితి

గవరవీధిలో కారుతున్న పట్టణ ఆరోగ్యం కేంద్రం భవనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో గత ప్రభుత్వం నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలు సమస్యలు నెలకొన్నాయి. దీంతో, సిబ్బంది రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనాల గోడలు నాని కారిపోతున్నాయి.

మున్సిపాలిటీలో గత ప్రభుత్వం పెద్దబొడ్డేపల్లి, బలిఘట్టం, గవర వీధిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను మంజూరు చేశారు. బొంతువీధిలో నిర్మించాల్సిన భవనం గవర వీధిలో నిర్మించారు. 17వ వార్డులో ఉన్న గవరవీధి, బలిఘట్టంలోనూ నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య భవనానికి గత ప్రభుత్వం ఎన్ఎయు హెచ్ఎం, పురపాలక సంఘం నిధుల నుండి ఒక్కొక్క భవనానికి 80 లక్షలు వెచ్చించారు.

వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ వెల్నెస్ సెంటర్ భవనాలను స్థానిక మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ 2024 జనవరి నెలలో అట్టహాసంగా ప్రారంభించారు. సంవత్సరం పూర్తి కాకుండానే కారిపోతున్న ఈ భవనాలను చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. గవరవీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం భవనాల గోడలు వర్షాలకు తడిచి నీరు కారుతోంది. స్టోర్ రూమ్‌లో వర్షపు నీరు కారి మందులు పూర్తిగా పాడవుతున్నాయని సిబ్బంది తెలిపారు. విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు పని చేయలేదని సిబ్బంది వాపోయారు.

బలిఘట్టంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

బలిఘట్టం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక బురదలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. ఆఫీసు రూము మధ్యలో బోరుబావి ఏర్పాటు చేసి అసంపూర్తిగా వదిలివేశారు. దానిపై బకెట్టు మూత ఏర్పాటు చేయడం విశేషం.ఇంత నాసిరకంగా భవనాలు నిర్మించినప్పటికీ మున్సిపల్ అధికారులు బిల్లులు చెల్లించి చేతులు దులుపుకున్నారు. రోజుకు 50 మంది వరకు రోగులు వస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

బలిఘట్టం పట్టణ ఆరోగ్యం కేంద్రం

అధికారులకు తెలియజేశాం

సమస్యలను అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. అసంపూర్తిగా వదిలేసిన పనులను చేయిస్తామని తెలియజేశారు. భవనంలో ఏదో ఒక ప్రదేశంలో నీరు లీకవుతూనే ఉంది. దీంతో మందులు వైద్య పరికరాలు తడిసిపోతున్నాయి.

- డాక్టర్ వినుషా మాధుర్య, బలిఘట్టం

తడుస్తున్న మందులు

ఎఎల్.పురం హైస్కూల్లో ఎస్‌పిఎల్ ఎన్నికలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఎఎల్ పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం 'స్కూల్ పీపుల్ లీడర్' (ఎస్పీఎల్) ఎన్నికలు నిర్వహించారు. ఎస్పీఎల్-1, ఎస్పీఎల్-2, లేడీ రిప్రజెంటేటివ్ పోస్టులకు పది మంది విద్యార్థులు పోటీ పడడంతో పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. పాఠశాలలో మొత్తం 700 మంది విద్యార్థులు వుండగా, సోమవారం 641 మంది హాజరయ్యారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పోలింగ్ నిర్వహించారు. ఎస్పీఎల్-1గా కసిపల్లి అనూష (9వ తరగతి), ఎస్పీఎల్- 2గా ముప్పల హేమ కిరణ్ (9వ తరగతి), లేడీ రిప్రజెంటేటివ్గా అనిమిరెడ్డి మాధవి (9వ తరగతి) ఎన్నికైనట్లు హెచ్ఎం తెలిపారు.

ఓటు వేస్తున్న విద్యార్థిని

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి కోరారు. సోమవారం మండలంలోని అమలాపురం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అమలాపురం పంచాయతీలో కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. కనీస వేతనాలు అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు.

పరీక్షిస్తున్న వైద్యాధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి గొలుగొండ: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కేడీపేట పిహెచ్సీ వైద్యాధికారి హరి ప్రవీణ్ సూచించారు. మండలంలో గిరిజన గ్రామీణ తాళ్లచీడికాడలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ఆచరించాలన్నారు. కాచి వడపోసిన నీటినే తాగాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో బిపి, షుగర్, జ్వరాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్, ఏఎన్ఎం ఉమా, ఆశా కార్యకర్తలు మంగతల్లి, అచ్చి పాప తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 6 నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పథకంలో భాగంగా ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పెన్షన్లు పంపిణీ ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, మొదటి రోజు సాయంత్రానికల్లా 99 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఇన్చార్జి తహసిల్దార్ సత్యనారాయణ, ఏవో సీతారామరాజు, ఈఓపిఆర్డి సత్యనారాయణ, ఎంఈఓ నరేష్, ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

హెచ్ఎం రాణీ లలితను సత్కరిస్తున్న కూటమి నాయకులు

స్ఫూర్తి దాతల పేర్లు పెట్టడంపై హర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తి దాతల పేర్లు పెట్టడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. జగనన్న గోరుముద్ద ను డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా పేరు మార్చడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ నిత్యాన్నదాత, అన్నపూర్ణ గా పేరుపొందిన డొక్కా సీతమ్మ కు 6వ వంశీకులు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గా విధులు నిర్వహిస్తున్న రాణీ లలిత అని తెలియడంతో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్ ,కూటమి నాయకులు మీగడ సత్తిబాబు, కోసూరి శ్రీనివాసరావు, కక్కిరాల సురేష్ పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

కవగుంటలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిభిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి నూకేష్ పరీక్షలు చేశారు. టీకాలను కోమిర సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ దేముడు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సూర్య కుమారి మాట్లాడుతూ, పశువులకు టీకాలను పాడి రైతులు వేయించాలన్నారు. పశువులకు టీకా, పశుభీమా వంటి వాటి పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:డిసెంబరు 8, 9 తేదీల్లో సీపీఎం అనకాపల్లి జిల్లా మహా సభలు నర్సీపట్నంలో నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా భూ సమస్యలు, మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యపై సిపిఎం పోరాటాలు నిర్వహించిందన్నారు. లేటరైట్ అక్రమ మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించిందని గుర్తు చేశారు. మాకవరపాలెం అన్‌రాక్ పరిశ్రమ నిర్వాసితుల నష్టపరిహారం, నర్సీపట్నం మున్సిపాలిటీలో ఆస్తి పన్ను, ఇళ్ల స్థలాలు, ఇళ్ల తదితర సమస్యలపై పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. అసంఘటితరంగ కార్మికులు ముఠా, భవన నిర్మాణ కార్మికులకు కార్మిక సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలన్న డిమాండ్‌కు పార్టీ తన కృషి చేస్తుందని చెప్పారు. శ్రామిక మహిళా సంఘాలైన కాఫీ, స్కీమ్ వర్కర్స్, ప్రభుత్వ రంగ సంస్థలలోను, ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న కార్మిక సమస్యలపై, హక్కుల కోసం పని చేస్తున్నామన్నారు. ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మరింతగా పోరాటాలు చేస్తామని తెలిపారు. డిసెంబరులో జరిగే సభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ, టి.ఈశ్వరరావులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి కేటాయింపులు ఏవీ?

బడ్జెట్ కాపీలు దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి తీవ్రంగా ద్రోహం, అన్యాయం చేశారన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు (ఎం ఎస్ పి) చట్టం చేస్తానని నిండు పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయమంటే మనసు రాని బిజెపి కార్పొరేట్‌లకు మాఫీ చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతుల రుణాలు మాఫీ చేయాలని, యాభై సంవత్సరాల నిండిన రైతులకు ఐదు వేల రూపాయలు పింఛను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, నాయకులు ఎం.త్రినాధరావు, ఎం.బాపూజీ, ఎస్.అప్పలరాజు, వరహాలు, ప్రసాద్, ఎర్రయ్య, సత్తిబాబు, సోమరాజు పాల్గొన్నారు.

లింగంపేటలో కారు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో పాసింబిల్లి మంగరాజుకు చెందిన కారు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. కారు యజమాని మంగరాజు కేడీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం దగ్ధమైన కారుని పరిశీలించింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, యజమాని షార్ట్ సర్క్యూట్‌తో కారు కాలి పోయి ఉంటుందని అనుమానాన్ని వెలిబుచ్చారన్నారు.

కారును పరిశీలిస్తున్న పోలీసులు

కుసులవాడ మైనింగ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్

ప్రజాశక్తి - ఆనందపురం, విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ సర్వే నెంబరు 104లో మైనింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యాన పార్టీ బృందం సదరు భూములను పరిశీలించింది. తమ ప్రాంతంలో ఖనిజ తవ్వకాల అనుమతులు రద్దు అయ్యేలా చూడాలని సిపిఎం నేతలు ఎదుట గ్రామస్తులు తమ ఆవేదన వెళ్లగక్కారు. తమ కష్టాలను చెప్పుకున్నారు. భూముల పరిశీలన అనంతరం నాయకులు కుసులవాడ గ్రామ సచివాలయానికి చేరుకొని జిఒ కాపీలను పరిశీలించారు. ఆనందపురం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌ను కలిసి క్వారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఎలాంటి సమాచారమూ రాలేదని, కేవలం క్వారీ విషయమై పంచాయతీ కార్యాలయంలో నోటీసులు అతికించామని తహశీల్దార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మైనింగ్ డిపార్టుమెంట్ నుంచి ఆదేశాలు వచ్చిన తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం జగ్గునాయుడు మీడియాతో మాట్లాడుతూ భారీ కొండలు, చెట్లు, పచ్చని పంటలతో ఈ ప్రాంతం ప్రకృతి నిలయంగా ఉందన్నారు. అక్కడ మైనింగ్ చేపడితే కొండలు ధ్వంసమవుతాయని తెలిపారు. ప్రకృతికి అపార నష్టం జరుగుతుందన్నారు. పంటలు దెబ్బతింటాయని, కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, గాలి కలుషితమవుతాయన్నారు. తుపాన్లు వంటి ప్రకృతి విపత్తుల నుండి రక్షణ కరువవుతుందన్నారు. అంతటి కీలకమైన ఆ భూముల్లో క్వార్ట్‌జైట్ మైనింగ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎస్ఒ1533 నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. కుసులవాడ గ్రామ సర్వే నెంబరు 104లో 7.991 హెక్టార్లలో రఫ్ స్టోన్ గ్రావెల్ మైనింగ్‌ని విఆర్ ఇన్ఫ్రా అండ్ టెక్నాలజీస్ అనే ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని చెప్పారు. ప్రకృతి సంపదను, ప్రజల ఆరోగ్యాలను కాపాడవలసిన ప్రభుత్వాలే ప్రకృతి విధ్వంసానికి పూనుకోవడం అమానుషమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కుసులవాడ మైనింగ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు రవ్వ నర్సింగరావు, కె.నాగరాణి పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న జగ్గునాయుడు తదితరులు

నిరసన చేపడుతున్న నాయకులు, గిరిజనులు

వంతెన నిర్మాణం చేపట్టాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలో అజయపురం గ్రామానికి వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ శివారు గిరిజన గ్రామంలోని గిరిజనులు జలదిగ్బంధంలో చిక్కున్నారని సోమవారం వారిని సందర్శించామని సిపిఎం మాడుగుల మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కార్లి.భవాని తెలిపారు. సోమవారం తాటిపార్తి తారు రోడ్డు నుండి కాలినడకన గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి గెడ్డలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, గత రెండు వారాల నుండి కురుస్తున్న వర్షాలకు అజయపురం గెడ్డ ఉధ్రుతంగా ప్రవహించడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గిరిజనులు పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు.జల దిగ్బంధంలో చిక్కుకుంటున్న గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వంతాల కేశవరావు, మచి రాజు, పోతురాజు, రాజులమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

-గిరిజనులకు అధికారుల హామీ

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం టి.అర్జాపురం శివారు కోట్నాబెల్లి గ్రామాన్ని సోమవారం అధికారుల బృందం సందర్శించింది.గ్రామానికి చెందిన పలువురు గిరిజన జాబ్ కార్డు దారులు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఆదివారం విన్నుత్న నిరసన చేసిన వార్త ప్రజాశక్తిలో సోమవారం ప్రచురణ కావడంతో సంబంధిత అధికారులు స్పంచారు. ఈ నేపథ్యంలో ఎపిడి జె మణి కుమార్, ఎంపిడిఓ సిహెచ్ భానోజీరావు, ఎపిఎమ్ కాశీ తదితరులు బృందం గ్రామంలో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఎపిడి మణి కుమార్ మాట్లాడుతూ, గ్రామంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన ప్రతి ఒక్కరికి 150 రోజుల ఉపాధి హామీ పథకం వర్తించ్చేలా చర్యలు చేపడతామని గిరిజనులకు హామీ ఇచ్చారు. పెళ్లి చేసుకున్న దంపతు లకు ఆధార్ కార్డు, జాబ్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పా రు. అటవీ శాఖ భూ ములు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎపిడి తెలిపారు. తుఫాన్ కంట్రోల్ వర్క్స్ తో పాటు ట్రెంచ్‌లు, మడి గట్లు మరో రెండు రోజులలో పనులు ప్రారంభించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆరుగురు మెట్లతో పాటు వీఆర్పిని కూడా త్వరలో నియమిస్తామని, పెండింగ్ బిల్లులు మంజూరుకు చొరవ తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు వలసయ్య, పాడి బెన్నయ్య పాల్గొన్నారు.

రిజర్వాయర్ గర్భంలో ఏర్పాటు చేసిన ఇనుపకంచె

రావణాపల్లి రిజర్వాయర్‌కు ముప్పు

-కంచె ఏర్పాటుతో పూడిక పెరిగే అవకాశం

- అధికారులు వ్యాపారులతో కుమ్మక్కయ్యారని రైతుల ఆరోపణ

- సమస్యను అయ్యన్న దృష్టికి తీసుకువెళ్లిన సాగు రైతులు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో 2,668 ఎకరాలకు సాగు నీరందిస్తున్న రావణాపల్లి రిజర్వాయర్‌కు అధికారుల నిర్లక్ష్యంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. రిజర్వాయర్ గర్భంలో కొంతమంది ప్రైవేటు వ్యాపారులు, మత్స్యకార సొసైటీ పాలకవర్గం కలిసి గత ఏడాది ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటుకు గత ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. దీంతో, రిజర్వాయర్ గర్భంలో పూడిక పెరిగి గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్లో నీటి నిలువలు పెరిగి 10 రోజుల క్రితం గండి ఏర్పడింది. స్థానికులు గండి ఏర్పడ్డ వెంటనే గుర్తించి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో రిజర్వాయర్కు పెను ప్రమాదం తప్పింది. రైతులకు సాగునీరు అందించే రిజర్వాయర్ గర్భంలో ఇనుప కంచె వంటి కట్టడాలు ఏర్పాటు చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

రిజర్వాయర్ గర్భంలో ట్రాక్టర్ ఇసుక లేదా మట్టిని తీసుకువెళ్తేనే నానా హడావిడి చేసి కేసులు పెట్టే ఇరిగేషన్ అధికారులు గత ఏడాది రిజర్వాయర్ గర్భంలో ఇనుపకంచె ఏర్పాటు చేస్తుంటే స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది.

పొర్లు కట్టు పైనుంచి ప్రవహిస్తున్న నీరు

రిజర్వాయర్ గర్భంలో ఎటువంటి కట్టడాలు ఏర్పాటు చేయకూడదనేది అందరికీ తెలిసిన విషయమే. మత్స్యకారులకు ఉపయోగ పడుతుందనే సాకుతో వ్యాపారుల లాభం కోసం గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినితో కలిసి ఈ కంచె ఏర్పాటుకు తెరలేపారు. గత ఏడాది ఇనుప కంచె ఏర్పాటు నిమిత్తం ప్రైవేట్ వ్యాపారులు ఇరిగేషన్ అధికారులకు, కొంతమంది ప్రజాప్రతినిధులకు కొంత సొమ్ము ముట్ట చెప్పారనే విషయం అప్పట్లో ప్రచారంలోకి వచ్చింది. కంచె ఏర్పాటు సమయంలో పలువురు రైతులు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తమ అభ్యంతరాన్ని తీసుకు వెళ్లినప్పటికీ ఉన్నతాధికారుల అనుమతులు ఉన్నాయంటూ పక్కదారి పట్టించారని కొంతమంది సాగురైతులు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్కు గండి ఏర్పడ్డ విషయాన్ని పలువురు రైతులు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుని దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో స్పీకర్ ఎలా స్పందిస్తారో చూడాలి.

హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గీతాకృష్ణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: బిసి సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ కోరారు. సోమవారం ఏబిసిడబ్ల్యూఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గీతాకృష్ణ మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్‌లోని అన్ని మండలాల్లో బిసి (పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్) హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బీసీ సంక్షేమ హాస్టల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. హాస్టల్లో శుభ్రత లేకపోవడంతో జ్వరాలకు గురవుతున్నారన్నారు.దోమ తెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో వార్డెన్లు అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు